


కస్టడీకి 10 మంది నిందితులు

● నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం

ములకలచెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె జడ్జి ఉమర్ ఫరూక్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. 10 మంది నిందితులను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటీషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న జడ్జి తొమ్మిది మంది నిందితులకు రెండు రోజులు, ఏ13 కట్టా సురేంద్రనాయుడుకు మూడు రోజులు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డీఎస్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన గౌస్‌బాషా



కడప స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా బుధవారం ఎస్.గౌస్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా డీఎస్‌డీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఆ మేరకు డీఎస్ఏ మైదానంలోని కార్యాలయంలో ఆయన చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను మరింత పురోగతి దిశగా తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మట్టిలో మాణిక్యాల్లా దాగి ఉన్న క్రీడాకారులను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసి తద్వారా జిల్లాకు, రాష్ట్రానికి పేరు తెచ్చేలా చేస్తామన్నారు.

పరిశోధనా విశ్వవిద్యాలయంగా వైవీయూ నిలవాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పరిశోధనలతో యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని రానున్న మూడేళ్లలో పరిశోధనా విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ సూచించారు. బుధవారం అన్నమాచార్య సెనేట్ హాల్లో రీసెర్చ్ స్కాలర్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రతి స్కాలర్ ప్రతిరోజు ల్యాబ్‌కు హాజరుకావాలని, నాణ్యమైన పరిశోధనలపైనే దృష్టి పెట్టాలని అన్నారు. ప్రముఖ జర్నల్స్‌లో ఆర్టికల్స్ ప్రచురిస్తే భవిష్యత్తు ఉజ్వలమవుతుందన్నారు. సోషల్ సైన్స్ విద్యార్థులకు స్వయంగా రీసెర్చ్ మెథడాలజీ క్లాసులు తీసుకుంటానని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నిపుణులను పక్షం రోజులకు ఒకసారి శిక్షణకోసం ఆహ్వానిస్తామన్నారు. స్కాలర్ల సమస్యలను పరిష్కరిస్తానని, రీసెర్చ్ స్టాండర్డ్స్ పెరిగితే ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు సాధిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొఫెసర్ చంద్ర ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

పోలీసులు బెదిరిస్తున్నారు

● వృద్ధుడు చలమయ్య ఆవేదన




పోలీస్‌స్టేషన్ బయట చలమయ్య

పులివెందుల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్రిమెంట్ ప్రకారం గడువు ఉన్నా గురువారం ఉదయం 7 గంటలకంతా ఇల్లు ఖాళీ చేసి అప్పు ఇచ్చిన వారికి అప్పగించాలని పోలీసులు బెదిరిస్తున్నారని వృద్ధుడు చలమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన మేరకు..

ఇంటిని తనఖా పెట్టుకున్న వారు గడువు తీరకముందే అప్పు తీర్చాలని ఒత్తిడి చేయడంతో చలమయ్య కుమారుడు కొంతకాలంగా అదృశ్యమయ్యాడు. దీంతో బుధవారం రాత్రి అప్పు ఇచ్చిన వ్యక్తి వచ్చి చలమయ్య దంపతులను బయటకు పంపించేసి ఇంటికి తాళం వేయడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. బుధవారం ఇరువర్గాలతో మాట్లాడతామని పోలీసులు హామీ ఇచ్చారు. పోలీసులు బుధవారం రాత్రి చలమయ్యను పోలీస్‌స్టేషన్‌కు పిలుచుకొని వచ్చి గురువారం ఉదయం 7గంటలకు ఇల్లు ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. సీఐ తమకు అన్యాయం చేస్తున్నారని చలమయ్య వాపోయారు. కాగా.. ఈ వ్యవహారంపై సీఐ సీతారామయ్య మాట్లాడుతూ.. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సామరస్యంగా పరిష్కరించుకోండని చెప్పామన్నారు. దీంతో ఇరుపక్షాల వారు కోర్టుద్వారా పరిష్కరించుకుంటామని చెప్పారన్నారు. సివిల్ పంచాయితీలో తాము తలదూర్చమన్నారు. తాము చలమయ్యను బెదిరించామనడం అవాస్తవమన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై భూ గద్దలు



కనుమలోపల్లి రెవెన్యూ పరిధిలో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు

- రూ.75 కోట్ల ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాజేసేందుకు స్కెచ్
- రెవెన్యూ అధికారులతో మిలాఖత్
- ఆక్రమణదారులతో సిద్దవటం రెవెన్యూ భాగస్వామ్యం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప - రేణిగుంట మధ్య రూ.3232కోట్ల వ్యయంతో 122 కి.మీ మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం జరుగుతోంది. కడప-రేణిగుంట రహదారికి ఆనుకుని ఇప్పటికే కడప నుంచి భాకరాపేట, మాధవరం, ఒంటిమిట్ట వరకు శరవేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే ఇక్కడ భూముల రేట్లు రోడ్డు పక్క ఎకరా ఎంత తక్కువ అనుకున్నా రూ.2 కోట్లు ఉంది. ఈ నేపథ్యంలో సిద్దవటానికి చెందిన ఓ నేత గ్రీన్‌ఫీల్డ్ రహదారి పక్కనున్న ప్రభుత్వ భూములు, పేదలకిచ్చిన అసైన్డ్ ల్యాండ్‌లపై దృష్టి పెట్టారు. వాటిని కాజేసేందుకు తనకు పూర్తిగా సహకరించే కొందరిని సిద్దవటం రెవెన్యూలో నియమించుకున్నట్లు చెబుతారు. ఆ రెవెన్యూ బ్యాచ్ సూచనల మేరకే పకడ్బందీగా ప్రభుత్వ భూములతో పాటు అసైన్డ్ భూములు కూడా కొట్టేసే యత్నం చేస్తున్నారు.

రూ.40 కోట్ల ప్రభుత్వ స్థలాలకు స్కెచ్

కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిలో కడప, సిద్దవటం రెవెన్యూ మండలాలు చాలా కీలకం. ఇక్కడ విలువైన భూములున్నాయి. కడప సబ్‌జైలు మొదలు, పోలీసు ట్రైనింగ్ సెంటర్, జేఎంజే కాలేజీ వరకు నివాసగృహాలున్నాయి. ఆ పక్కనే సిద్దవటం రెవెన్యూ పరిధి వస్తుంది. అంటే దాదాపు ఒంటిమిట్ట మండలం వరకు హైవే పక్కన కడప, సిద్దవటం మండలాల్లో చాలా విలువైన భూములున్నాయి. దీంతో ఇక్కడున్న ప్రభుత్వ భూములపై సిద్దవటానికి చెందిన కేఎస్ బ్యాచ్ కన్నేసింది. కనుమలోపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.112/1లో 4.88 ఎకరాలు, 112/2లో 0.26 సెంట్లు, 113లో 4.23 ఎకరాలు, 38లో 1.81 ఎకరాలు, 39/1లో 3ఎకరాలు, 39/2లో 4.03, 40/1లో 3.53 ఎకరాలు, 40/2లో 0.24 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. బుధవారం సాయంత్రం వరకు కూడా అడంగల్‌లో ఇవి ప్రభుత్వ భూములుగానే నమోదై ఉన్నాయి. వైసీపీ హయాంలో కూడా వీటి జోలికి ఎవరూ వెళ్లలేదు. ఈ భూములు సుమారు రూ.40 కోట్లకు పైగా చేస్తాయి. వీటిని కేఎస్ బ్యాచ్ కొట్టేసే యత్నాలు చేస్తోంది. వీటిని కాజేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లను తయారు చేసేందుకు సిద్దవటం రెవెన్యూలోనే కొందరు సహకరించారని అంటున్నారు.

> ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతోంది. వైసీపీ హయాంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల స్వాధీనంతో పాటు ప్రైవేటు భూములను కూడా స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు అప్పజెబుతూ వస్తోంది. ఇక జిల్లాలో అన్యాక్రాంతానికి గురైన వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నేతృత్వంలో తిరిగి స్వాధీనం చేసుకున్నారు. భూ వివాదాలను తీర్చేందుకే కలెక్టర్ ప్రత్యేక గ్రీవెన్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో దాదాపు రూ.75కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు కొట్టేసేందుకు కేఎస్ బ్యాచ్ స్కెచ్ వేయడం, అందుకు సిద్దవటం రెవెన్యూ గ్యాంగ్ సహకరించే యత్నంలో ఉండడమే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

రూ.35 కోట్ల అసైన్డ్ భూములపైనా..

కడప నుంచి భాకరపేట మధ్యలోని రహదారిలో ఓ చర్చి పక్కన సుమారు రూ.15 కోట్ల విలువ చేసే ఓ అసైన్డ్ భూమి ఉంది. దీనిపైనా కన్నేశారు. ఇక 1980కి ముందే ఇక్కడ రెండు ఎకరాల చొప్పున ఎస్సీలకు ముగ్గురికి ఆరు ఎకరాలు కేటాయించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు కానుండటంతో ఈ భూములకు మంచి విలువ వచ్చింది. ఈ భూములు కూడా సుమారు రూ.6కోట్లు చేస్తాయి. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములు అమ్మడం, కొనడం నేరం. అయితే ఇక్కడ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికే ఈ భూములు అనధికారికంగా ముగ్గురు పేరిట మారిపోయాయి. ఇది ఇష్యూ కావడంతో భూ వారసులు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. అయితే రెవెన్యూ అధికారులు బతికున్న వారసులకు నోటీసులు ఇవ్వకుండా చనిపోయిన వారికి నోటీసులు ఇచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ భూములను కూడా కేఎస్ బ్యాచే కొట్టేసేందుకు సిద్దవటం రెవెన్యూ బ్యాచ్‌తో నోటీసులు ఇప్పించారని చెబుతారు. అటు కేఎస్ బ్యాచ్ భాకరాపేట-బద్వేలు రహదారి పక్కన ఉన్న రెండు ఎకరాల భూమి, భాకరాపేట-రేణిగుంట రోడ్డులోని మరో ఐదెకరాల అసైన్డ్‌భూములు కొట్టేసేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఆ భూములు రద్దు చేసినట్లు రికార్డులు సృష్టించారని చెబుతున్నారు. ఇక్కడ కేఎస్ బ్యాచ్ కొట్టేయాలనుకుంటున్న అసైన్డ్ భూములన్నీ కలిపి దాదాపు రూ.35కోట్లు చేస్తాయని అంటున్నారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోకపోతే విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం కాకమానవు.

ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

కడప కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధిక ఎరువుల వినియోగాన్ని కట్టడి చేసేలా రైతుల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భూమాత రక్షణ కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. చైర్మన్‌గా కలెక్టర్, కో-చైర్మన్ జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్(కన్వీనర్)లతో పాటు ఎస్పీ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, కేవీకే శాస్త్రవేత్తలు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూమాత రక్షణ కమిటీ ద్వారా రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఐదుగురు ప్రోత్సాహక రైతులను ఈ కమిటీలో సభ్యులుగా తీసుకోవాలన్నారు. డివిజన్, గ్రామ స్థాయి కమిటీలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించాలి

- జర్మన్ ప్రభుత్వ అంబాసిడర్ ఫిలిప్ అకెర్మాన్
- పులివెందులలోని ఏపీ కార్ల్ సందర్శన




పులివెందుల ఏపీకార్ల్‌లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జర్మన్ అంబాసిడర్ ఫిలిప్ అకెర్మాన్, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తదితరులు

పులివెందుల / పులివెందుల టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించాలని జర్మన్ ప్రభుత్వ అంబాసిడర్ ఫిలిప్ అకెర్మాన్ పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్ (ఏపీకార్ల్)లో ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లర్నింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐజీజీఏఏఆర్ఎల్ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని జర్మన్ ఫెడరల్ ప్రభుత్వ అంబాసిడర్ డాక్టర్ ఫిలిప్ అకెర్మాన్ బృందం పరిశీలించింది. ముందుగా ఈ బృందం ఇక్కడ ప్రయోగాత్మకంగా సాగుతున్న ప్రకృతి వ్యసాయ క్షేత్రాన్ని సందర్శించారు. వాటితో ఏపీకార్ల్‌లో చేపట్టిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి అధ్యయనాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ చక్రం ద్వారా సాగుపద్ధతులు, రైతు సాధికార సంస్థచే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఈ బృందం పరిశీలించింది. మిల్లెట్స్ తో తయారుచేసిన ఆహారపదార్థాలను చూసి అభినందించారు. ఈ సందర్భంగా జర్మన్ ప్రభుత్వ అంబాసిడర్ ఫిలిప్ అకెర్మాన్ మాట్లాడుతూ పులివెందులలో ప్రకృతి వ్యవసాయం ఎంతో నేచురల్‌గా సాగుతోంద న్నారు. పంటలకు ఎలాంటి రసాయనాలు గాని, పురుగుమందులు వాడకుండా పూర్తిగా ప్రకృతిలో దొరికే వాటితోనే ఇక్కడ పంటలు సాగుచేస్తున్నారని అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందులోను పులివెందుల ప్రాంతంలో హార్టికల్చర్ ఎక్కువగా ఉందన్నారు. ఈ పంటలను నేచురల్ పద్ధతిలో సాగుచేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి చాలా తక్కువగా ఉంటుందని, పంట దిగుబడి మెరుగ్గా ఉంటుందని అన్నారు. ఇందుకోసం జర్మన్ ప్రభుత్వం ఏపీకార్ల్‌లో ఇలాంటి ప్రకృతి వ్యవసాయ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుచేయడం ఈ ప్రాంతానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీజీఏఏఆర్ఎల్ఐ ఏఓ శివారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌అనకుంటే.. ఐపోతారు..!

తప్పు అని ప్రశ్నిస్తే చితక్కొట్టుడే ● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పెండ్లిమర్రి ఎస్ఐ



పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్

పెండ్లిమర్రి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని.. స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా మెలగాలని.. పల్లెనిద్ర చేసి ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచాలని పోలీస్‌బాస్‌లు పదేపదే చెబుతున్నారు. అయితే పెండ్లిమర్రి ఎస్ఐ మాత్రం ఇవేమీ పట్టించుకోవడం లేదు. తనను ఎవరైనా ప్రశ్నిస్తే చితక్కొట్టడమే పనిగా పెట్టుకున్నారు.

పెండ్లిమర్రి ఎస్ఐగా మధుసూదన్‌రెడ్డి ఏడాది కాలంగా పనిచేస్తున్నారు. ఈయన రూటే సపరేటు. పోలీసులు శాంతి భద్రతలను కాపడతారంటారు. ఈయనే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారు. ఫ్రెండ్లీ పోలీసంగ్ అనేది ఈయన డిక్షనరీలోనే లేదు.. స్టేషన్‌కు వచ్చే వారిని, ఆయన చేసేది తప్పు అని చెప్పే వాళ్లను చితక్కొడుతున్నారు. ఎక్కడ పనిచేసినా ఈయన వ్యవహారం ఇలానే ఉంటుందని అంటున్నారు. ఏ స్టేషన్‌లోనూ ఈయన ఎక్కువకాలం పనిచేయలేదని సమాచారం. దీనికి ఈయన వ్యవహార్‌శైలే కారణం.

ఇదీ సారు యవ్వారం

- మండలంలోని యం.చౌటపల్లెలో మార్చి 29వ తేదీన సుబ్బయ్య అనే వ్యక్తిని పథకం ప్రకారం హత్య చేశారు. ఐతే తొలుత అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. ఐదు నెలలు దాటినా కేసులో ఎలాంటి కదలిక లేదు. తన కుమారుడిని హత్య చేశారంటూ ఎస్పీకి తండ్రి ఫిర్యాదు చేశారు. డీఎస్పీతో ఎస్పీ విచారణ చేయించగా ఇది హత్యగా తేలింది. దీంతో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వ్యవహార శైలి మరోసారి చర్చకు దారి తీసింది.
- ఏప్రిల్ 19న నాగాయపల్లెకు చెందిన రామఓబుల్‌రెడ్డి అలియాస్ ఇంద్రకు ఎస్ఐకి మధ్య జూదం విషయమై వాగ్వాదం జరిగింది. ఇంద్ర మద్యం తాగి వచ్చి గొడవకు దిగడంతో ఎస్ఐ లాఠీని ఝులిపించారు. ఇతను రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- వాహనాల తనిఖీలో ఇద్దరు వ్యక్తులు బైకు నిలబెట్టకుండా వెళ్లినందుకు వారిని ఎస్ఐ చేజ్ చేసి లాఠీ విసిరారు. ఆ లాఠీ బైకు చక్రంలో చిక్కుకోవడంతో వారిద్దరూ కింద పడి గాయపడ్డారు. సమస్య పెద్దది కావడంతో చివరకు పెద్దమనుషుల జోక్యంతో సద్దు మణిగింది.
- వెల్లటూరు వద్ద వాహనాల తనిఖీ సమయంలో.. తల్లి, కుమారుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎస్ఐ కొడతాడనే భయంతో తల్లి వాహనంపై నుంచి దూకేశారు. ఆమె కుమారుడిని ఎస్ఐ చితకబాదారు.
- పోలీస్‌స్టేషన్‌వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పెద్దవాహనం స్కూటర్‌ను ఢీకొంది. గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడికి పెద్దవాహన యజమాని చికిత్స చేయించారు. దానిపై ఎలాంటి కేసు నమోదు చేయకపోగా బైకును పోలీసుస్టేషన్‌లోనే ఉంచుకున్నారు. అతని భార్య స్టేషన్‌కు వెళ్లి బైకు ఇవ్వాలని అడగగా ఎస్ఐ ఆమెను దుర్భాషలాడారు. కేసు నమోదు చేయకపోగా.. ప్రమాదం జరిగిన మూడు నెలలకు బైకును బాధితులకు తిరిగి ఇచ్చారు.
- అగస్టు 26వ తేదీన పోలీసు స్టేషన్ వద్దనే పోలీసుల సమక్షంలోనే ఇరువర్గాలవారు పరస్పరం రాళ్లదాడి చేసుకున్నారు.
- జూలైలో రాళ్లపల్లెకు చెందిన డబ్బుల పంచాయతీలో ఒక వర్గానికి వత్తాసు పలకడంతో మరో వర్గం వ్యక్తి హైకోర్టులో ఎస్ఐపై పిటీషన్ వేశారు. దీంతో రెచ్చిపోయిన ఎస్ఐ నామీద పిటీషన్ వేస్తావా నీ అంతు చూస్తా, నిన్ను ఎన్‌కౌంటర్ చేస్తా అంటూ.. అతడిని స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురిచేయడం మండలంలో కలకలం రేపింది.

ఇలాంటివి ఎన్నో.. ఎస్ఐ చేసే సివిల్ పంచాయితీలైతే కోకొల్లలు. మండలంలోని ప్రతి గ్రామంలో ఎస్సై చేసిన ఘనకార్యాలు అనేకం ఉన్నాయి. ఎస్ఐ మధసూదన్‌రెడ్డి వ్యవహార శైలిపై పెండ్లిమర్రి సీఐ చల్లనిదొరను ఆంధ్రజ్యోతి వివరణకోరగా.. అవన్నీ ఎందుకులే అంటూ సమాధానం చెప్పకుండా దాటవేశారు.

ఇదేమి విచారణ..?

- 2002లో కడప ఒకేషనల్ కేంద్రాల్లో అక్రమాలు నమోదు
- నలుగురు ప్రధానోపాధ్యాయులపై ఏసీబీ కేసులు
- అప్పటి నుంచి విచారణాధికారుల మార్పుతోనే సరిపెడుతున్న వైనం
- తాజాగా విచారణకు ప్రెజెంటింగ్ అధికారి నియామకం



కలికిరి / కడప, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒక్కోసారి ప్రభుత్వ వ్యవహారాల్లో జరిగే పరిణామాలు విస్తుగొలుపుతుంటాయి. అలాంటి దానికి ఉదాహరణే ఇది. అప్పట్లో వెలుగుచూసిన అక్రమాలపై నమోదైన అభియోగాల గురించి పాతికేళ్లు కావస్తున్నా విచారణ దిశగా అడుగులు పడటం లేదు. అటు కేసు నమోదు చేసిన ఏసీబీలో నుంచి, ఇటు మున్సిపల్ శాఖలో నుంచి నియమించిన విచారణాధికారులు బదిలీలు, పదవీ విరమణలు, అయిష్టత కారణంగా విచారణ నుంచి తప్పుకోవడం.. మళ్లీ కొత్త వారిని నియమించడం.. ఇలానే దశాబ్దాలు గడిచిపోతున్నాయి. కడప మున్సిపాలిటీలో పరిధిలో జరిగిన అక్రమాలకు సంబంధించి తాజాగా కొనసా..గుతున్న విచారణకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2000 సంవత్సరంలో కడప మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ హైస్కూళ్లలో ఒకేషనల్ విద్యా కేంద్రాలుండేవి. వీటిలో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులందిన నేపథ్యంలో 2002 మార్చి 28న ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమాలు జరిగాయని గుర్తించారు. ఈ మేరకు అప్పటి మున్సిపల్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయలు ఎన్.ఓబులయ్య (ప్రస్తుతం రిటైర్డు), ఎన్.వరదారెడ్డి, పి.రామసుబ్బయ్య, ఎ.సుబ్బయ్యపై కేసులు నమోదు చేశారు. దీనిపైన వీరి నుంచి సంజాయిషీలు కోరగా.. అవి సంతృప్తికరంగా లేకపోవడంతో ప్రభుత్వ మున్సిపల్ శాఖ విచారణకు ఉపక్రమించింది.

- 2006 నవంబరు 6వ తేదీన గుంటూరు మున్సిపల్ కమిషనర్ కె.సుధాకర్‌ను విచారణాధికారిగా, హైదరాబాదు నుంచి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవీంద్రరెడ్డిని ప్రెజెంటింగ్ అధికారిగా నియమించారు.
- రవీంద్రరెడ్డి ఏసీబీ నుంచి వేరే శాఖకు వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో తిరుపతి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌ను నియమించారు.
- ఆ తరువాత ఆయనకు బదులుగా 2008 అక్టోబరు 6న తిరుపతి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజును నియమించారు.
- ఈయన కూడా ఏసీబీ నుంచి వెళ్లిపోవడంతో ఆ స్థానాన్ని కడప ఏసీబీ ఇన్‌స్పెక్టర్ కె.రాజేంద్రప్రసాద్‌తో భర్తీచేశారు.
- ఇదిలా ఉండగానే తనకు ప్రజాపథంలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలున్న కారణంగా తనను తప్పించాలని 2012 ఏప్రిల్ 20 విచారణాధికారి కె.సుధాకర్ విన్నవించారు. దీంతో సుధాకర్‌ను తప్పించి ఆయన స్థానంలో అనంతపురం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ పి.మురళీకృష్ణ గౌడ్‌ను తదుపరి విచారణాధికారిగా 2013 ఫిబ్రవరి 14వ తేదీన నియమించారు.
- ఆ తరువాత మురళీకృష్ణ కర్నూలు అడిషనల్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో 2015 సెప్టెంబరు 9 అనంతపుర ఆర్డీఎంఏ సీహెచ్ విజయలక్ష్మిని కొత్త విచారణాధికారిగా నియమించారు.
- ఈమె విచారణ కొనసాగించేలోగా ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత ఈమె స్థానంలో 2021 ఏప్రిల్ 19న అనంతపురం ఆర్డీఎంఏ జి.నాగరాజును విచారణాధికారిగా నియమించారు.
- ఈలోగా ప్రెజెంటింగ్ అధికారిగా ఉన్న రాజేంద్రప్రసాద్ వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో 2021 సెప్టెంబరు 29న కొత్త ప్రెజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ ఇన్‌స్పెక్టర్ టి.రెడ్డెప్పను నియమించారు.
- ఆ తరువాత రెడ్డెప్ప స్థానంలో 2022 అక్టోబరు 19న కడప ఏసీబీకి సంబంధించిన మరో ఇన్‌స్పెక్టర్ కె.ఎల్లమరాజును నియమించారు.
- ఎల్లమరాజు కూడా ఏసీబీని వదిలి వేరే శాఖకు వెళ్లిపోవడంతో తాజాగా ఆయన స్థానంలో మరో ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిని నియమిస్తూ మంగళవారం మున్సిపల్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి ఈ పాతికేళ్లలో ఏదైనా విచారణ జరిగిందా అన్న విషయం మాత్రం ప్రభుత్వం ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

బ్రహ్మంగారిమఠానికి పీఠాధిపతిగా
గోవిందస్వామిని నియమించండి
ఏపీ సాధు పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ

కడప మారుతీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి సంబంధిత మఠం వారసుడైన గోవిందస్వామిని పీఠాధిపతిగా నియమించాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ, ప్రకాశానంద సరస్వతి స్వామీజీ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మఠానికి నాలుగు సంవత్సరాలుగా పీఠాధిపతి లేకపోవడం యావత్ హిందూ భక్తులకు వెలితిగా ఉందన్నారు. గోవిందస్వామిని పీఠాధిపతిగా ఎంపిక కావడానికి అతని అన్నదమ్ములు కూడా సహకారం అందించేందుకు ముందుకు రావాలన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ వందశాతం జరగాలి



స్థానికులతో మాట్లాడుతున్న ఎంహెచ్ఓ డాక్టర్ రమేశ్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటి నుంచి చెత్తసేకరణ వందశాతం చేయాలని ఎంహెచ్ఓ డాక్టర్ సౌదాగిరి రమేష్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. బుధవారం నగర పర్యటనలో భాగంగా 41వ డివిజన్ రవీంద్రనగర్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంతలరోడ్డులో మొక్కలు నాటి నిరసన



కమలాపురం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయండి మహాప్రభో అంటూ ఆ గుంతల్లో మొక్కలు నాటి కమలాపురం యువకులు నిరసన చేపట్టారు. జూటూరు విజయ్‌కుమార్,నీలం శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ గుంతలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. గుంతలు పూడ్చకుంటే పెద్ద ఎత్తున నిరసన చేస్తామని హెచ్చరించారు. ఆ మేరకు గుంతల్లో మొక్కలు నాటి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హరి, మునిరాజు స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచాలి
యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కొత్త ఉపాధ్యాయులకు కరపత్రాలు అందిస్తున్న నక్కా వెంకటేశ్వర్లు

వేంపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్ని రకాల విద్యాసామగ్రిని ఉచితంగా అందిస్తోందని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించి ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు నూతన ఉపాధ్యాయులకు సూచించారు. మెగా డీఎస్సీలో ఎంపికై పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులతో యూటీఎఫ్ నాయకులు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేముల, చక్రాయపేట, వేంపల్లె మండలాల పరిధిలోని ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, లక్ష్మీరాజా ,విజయ్‌కుమార్, మహేష్‌బాబు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్‌గా బాలక్రిష్ణయాదవ్

కడప మారుతీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్‌గా కడపకు చెందిన ఎం.బాలక్రిష్ణయాదవ్ నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పలువురిని నియమించారు.

పనులు మొదలు



కల్లూరుపల్లె రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

చక్రాయపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుపల్లె రోడ్డుకు కంకర వేసి తారుమరిచారు అనే వార్త బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడింది. అందుకు స్పందించి బుధవారం పనులు చేపట్టి పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నారు. కంకరపై తారు రోడ్డు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరు కిలోమీటర్ల దూరాన్ని పూర్తిచేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేపట్టారు. అదిమారుమూల ప్రాంతమైన కల్లూరుపల్లె తదితర గ్రామాలకు వరంలా మారనుంది.

అధ్వానంగా కొండపేట చెరువు కట్ట



కొండపేట చెరువు కట్ట మీదుగా బురద గుంతలతో ఉన్న దారి

చెన్నూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట చెరువు కట్టకు ప్రస్తుతం మూడు వైపులా రోడ్లు బాగున్నాయి. మరో వైపు మాత్రం రోడ్డు బాగు లేకపోవడంతో ఆ చెరువు కింది ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు వెళ్లేందుకు కానీ చివరికి నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. దీంతో చెరువుచుట్టూ పంట పొలాలు సాగు చేసే రైతులు మూడు వైపులా రోడ్డు ఎంతో బాగు వేశారు. ఈ ఒక్క వైపు వేస్తే ఎంతో మంది రైతులకు ఉపయోగం కాదా అంటున్నారు. గత ఏడాది నాబార్డు నిధులతో పీఎంజీఎస్‌వై పథకంలో రూ.4.25 కోట్లతో దౌలతాపురం క్రాసింగ్ నుంచి దౌలతాపురం వరకు, అక్కడ నుంచి ఎస్టీ కైలసగిరి కోన వరకు అలాగే కొండపేట చెరువు కట్టమీద నుంచి ఎస్టీ రామాపురం కాలనీ రోడ్డు కలిసే వరకు, అలాగే కొండపేట నుంచి కనుపర్తి వరకు అటు సీసీ రోడ్డు ఇటు తారు రోడ్డు వేయడం జరిగింది. ఇన్ని రోడ్లు బాగానే ఉన్నాయి. అయితే కొండపేట నుంచి దౌలతాపురం వెళ్లేందుకు చెరువు కట్ట మీదుగా అతి దగ్గర దారిఉంది. కేవలం ముప్పాతిక కిలోమీటరు మెటల్ రోడ్డు వేసినా అది రైతులకు ఉపయోగపడుతుంది. ఎన్నో ఏళ్లక్రితం ఈ రోడ్డు వేశారు. ప్రస్తుతం చినుకు పడిందంటే దారంతా బురదమయం. జారే పరిస్థితి. ఇలాంటి స్థితిలో ఆ రోడ్డు వేసి బాగు చేస్తే ఎంతో మంది రైతులకు ఉపయోగపడుతుంది.

పుస్తకాల బహూకరణ

కడప కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కడపలో నూతనంగా కడప రెడ్డిసేవా సమితి ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయం కోసం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అదనంగా ఉన్న 300 పుస్తకాలను రెడ్డిసేవాసమితికి పుస్తకాలు అందించారు. ఆ మేరకు బుధవారం సీపీ బ్రౌన్‌భాషా గ్రంథాలయంలో ఆ పుస్తకాలను బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సంచాలకురాలు ఆచార్య జి.పార్వతి, మూలమల్లిఖార్జునరెడ్డి , బ్రౌన్ గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలపై తనిఖీ లేవీ..? : డీవైఎఫ్ఐ

కడపసెవెన్ రోడ్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్న, వీరనాలశివకుమార్ తెలిపారు. బుధవారం కడపలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమామహేశ్వర రావుకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఆందోళనలు

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నవంబరులో 4జోన్ల వారీగా కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పేర్కొన్నారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ కడపనగర వెస్ట్ జోన్ ముఖ్యుల మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మద్దిలేటి,సావంత్, సుధాకర్, చెంచయ్య తదితరులుపాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

వేంపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం పాములూరు గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా నాయకుడు కారు అంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమిత స్థలం, ప్రభుత్వ స్థలంలో బోర్లు నాటారని, అయితే దౌర్జన్యంగా ఆ బోర్డును తొలగించడం అన్యాయమన్నారు. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యానేరం

వేంపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యానేరమని తాళ్లపల్లె వైద్యశాల హెచ్‌ఈ షఫిఉన్నీసా తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని గ్రామాల్లోమహిళలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ బసయ్య, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు ఉపయోగించాలి

వేంపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా వచ్చిన ఫలితాల ఆధారంగానే రైతులు ఎరువులు ఉపయోగించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. వేంపల్లె మండలంలోని అలిరెడ్డిపల్లె, ఇడుపుల పాయ గ్రామాల్లో భూసార పరీక్షల ప్రయోజనంపై రైతులకు అవగాహన కల్పించారు.ఏఓ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పైప్‌లైన్‌కు పరిశీలన

వేంపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య ఇబ్బంది కలుగకుండా ముందస్తు ప్రణాళికలో ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు.వేంపల్లె పట్టణంలో మెగా కంపెనీ ద్వారా ఏర్పాటు చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాలన్, ఏఈ దివ్య, పంచాయతీ ఈఓ నాగభూషణంరెడ్డిలతో కలిసి వేంపల్లె పట్టణంలో పరిశీలించారు.

పరిశుభ్రతే ప్రధానం



పరిశుభ్రతపై విద్యార్థులకు వివరిస్తున్న ఎంఈవో-2 సునీత

చెన్నూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత ముఖ్యమని ప్రతి రోజూ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎంఈవో-2 సునీత అన్నారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులతో కుళాయిల వద్ద భోజనానికి ముందు తరువాత చేతిని ఎలా శుభ్రం చేసుకోవచ్చు. ఎలాంటి వస్తువులు వాడాలన్నదానిపై వివరిం చారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నిరసనను జయప్రదం చేయండి

కడపనాగరాజుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తలపెట్టిన నిరసనను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్, స్ట్రగుల్ కమిటీ, రాష్ట్రకమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడిందని ,17వ తేదీ నిరసనను తలపెట్టామని రాష్ట్ర చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు.

బోర్డుమెంబరు కావడం హర్షణీయం

కడప కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి 40 సంవత్సరాలుగా చేసిన సేవలకు గాను బాధ్యతాయుత ఎంపీటీసీగా, మాజీ కార్పొరేటరుగా విశేషసేవలందించిన పెనగలూరు హేమావతిని ప్రభుత్వం శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డుమెంబరుగా నియమించడం హర్షణీయమని జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలక్రిష్ణశర్మ కొనియాడారు. ఆ మేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రాహ్మణపల్లె చంద్రమౌళీశర్మ శ్రీధర్‌శర్మ, అజయ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వీసీకి సత్కారం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బుధవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డిని మొల్లసాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హనుమంతరావు వీసీని శాలువతో సత్కరించి, తన రచనలు అందజేశారు.

పారదర్శకంగా టపాసుల దుకాణాలకు లాటరీ
●తహసీల్దారు నారాయణ రెడ్డి

కడప కలెక్టరేట్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా కడపలో ఏర్పాటు చేయనున్న టపాసుల దుకాణాలకు ర్యాండమైజేషన్ పద్ధతిలో పారదర్శకంగా లాటరీ నిర్వహించినట్లు కడప తహసీల్దారు నారాయణరెడ్డి తెలిపారు. కడప ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాత్రి టపాసుల దుకాణాలకు 139 దరకాస్తులు రాగా అందులో కడపలోని మున్సిపల్ స్టేడియం, ఈద్గా వద్ద ఏర్పాటు చేయనున్న 77 దుకాణాలకు కంప్యూటర్ పద్ధతిలో ఎంపికలు జరిగాయి. ఈకార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనరు సుమతి,ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి శంకరయ్య, డిప్యూటీ తహసీల్దారుకె.శివారెడ్డి, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పాల్గొన్నారు.



టపాసుల దుకాణాలను ఎంపిక చేస్తున్న అధికారులు

డ్రగ్స్‌పై అవగాహన

కడప క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారద నర్సింగ్ కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో.. కార్యక్రమాన్ని బుధవారం ఈగల్ టీం, నార్కోటిక్ టీం , డిస్ట్రిక్ట్ డి అడిక్షన్ సెంటరు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శారద నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ జయశ్రీనివాసులు, స్పిరిట్ కాలేజ్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. గంజాయి గురించి సమాచారాన్ని ఈగల్ టోల్‌ఫ్రీ నెంబరు 1972కు కానీ, 8977781972కు వాట్సప్ ద్వారా తెల పాలన్నారు. కార్యక్రమంలో ఏడీ క్రిష్ణకిశోర్, రిహాబిలిటేషన్ ఆఫీసరు శ్రీకాంత్, డీఏడీఏఎస్ సిబ్బంది. నార్కోటిక్ సెల్ మల్లయ్య పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి'

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కడప నగరం 3వ డివిజన్ వికలాంగుల కాలనీలో రచ్చబండ - కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ మేయర్ కె.సురేష్‌బాబు, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొని సంతకాలు చేశారు.

మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేదరులను (మహేంద్ర) ప్రభుత్వాలు తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ మహేంద్ర (మేదర)సంఘం అధ్యక్షుడు జె.మస్తాన్‌రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టంగుటూరి యల్లాల బాబు డిమాండ్ చేశారు. ఏపీ మహేంద్ర, మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ల గంగయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్‌క్లబ్ లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఏపీ మహేంద్ర (మేదర) సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, పలువురు మేదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉల్లి రైతాంగాన్ని ఆదుకోవాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉల్లి వేసి తీవ్రంగా నష్టపోయిన కమలాపురం నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని వైసీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డికి విన్నవించారు. పులివెందులలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం కమలాపురం నియోజకవర్గంలోని రైతులు, పలువురు నాయకులతో కలిసి ఎంపీని కలిసి ఉల్లిగడ్డ రైతుల బాధలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉల్లిరైతుల కష్టాలు తెలుసుకున్నానని, కలెక్టరుతో చర్చలు చేస్తామని సమాధానం ఇచ్చారు.

మండల అభివృద్ధే లక్ష్యం : ఎంపీడీవో

సీకేదిన్నె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు గత మూడు నెలలుగా వారి శాఖల్లో నిర్వహించిన ప్రగతిని వివరించారు. అంతకుముందు మండల సమావేశం ప్రారంభం కాగానే సింగిల్‌విండో చైర్మన్ గంధం మోహన్‌బాబు వేదికపై కూర్చోగా అందుకు ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అభ్యంతరం తెలుపడంతో ఎంపీడీవో కల్పించుకుని సర్దిచెప్పడంతో సింగిల్‌విండో చైర్మన్ స్టేజీపై నుంచి దిగిపోయారు. దీంతో సమావేశం యథావిధిగా సాగింది. అయితే నాలుగైదు సమావేశాల నుంచి ఎంపీపీ హాజరుకాలేదని కొందరు చర్చించుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఆడ,మగ ఇద్దరూ సమానమే



మాట్లాడుతున్న డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీదేవి

పెండ్లిమర్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):సమాజంలో ఆడ,మగ ఇద్దరూ సమానమే అని డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీదేవి తెలిపారు.అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సేవ్‌దిగర్ల్‌చైల్డ్ అనే నినాదంతో ఆడ బిడ్డను కాపాడుకుందాం,చదివించుకుందాం అనేదానిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లల కోసం ఉన్న చట్టాలు,ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

సైబర్ నేరగాళ్లపై మహిళలకు అవగాహన

చక్రాయపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలు చేస్తున్నట్లు జాగ్రత్తగా ఉండాలని మహిళలకు ట్రిపుల్‌ఐటీ పోలీసులు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. బుధవారం గండి క్షేత్రానికి వచ్చిన మహిళలకు ఈ సైబర్ నేరాలపై క్లుప్తంగా వివరించారు. అలాగే శక్తియాప్ ఉపయోగించాలని దాని వల్ల మహిళలకు రక్షణ కలుగుతుందని తెలియజేశారు. వివిధ మోసాలు జరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలని కోరారు.

కలాం అడుగుజాడలు స్ఫూర్తిదాయకం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అడుగుజాడలు మనకు స్ఫూర్తిదాయకమని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. బుధవారం వైవీయూ అబ్దుల్ కలాం భవనంలో కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో వైవీయు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: అంతరిక్షయానంలో మన దేశాన్ని అగ్రగామిగా నిలపడంలో దివంగత మాజీ భారత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం కృషి ఎంతో కలదని అందుకే ఆయనను మనదేశం యావత్తు మిస్సైల్ మ్యాన్‌గా కొనియాడిందని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర నాయకుడు బత్తల పవన్‌కుమార్, జిల్లాకార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, 12వ డివిజను ఇన్‌చార్జ్ మల్లికార్జునరెడ్డి కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారంఎన్జీవో కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత వారు అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్‌రావు, బాలక్రిష్ణ, శ్రీనివాసులు, జబ్బార్, ఇలియాస్ పాల్గొన్నారు.



కడప...అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్

వేంపల్లె..: భారత మాజీ రాష్ట్రపతి, క్షిపణి పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం అందరికి ఆదర్శం, స్ఫూర్తిదాయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు.

లాభాల సాగు...

- అంతరపంటలతో చీడపీడల నివారణ
- దిగుబడి అధికం

పత్తిలో కందిపంట సాగు



మిరపలో అంతరపంటగా గుండుమల్లె సాగు



మొక్కజొన్నలో మగమొక్కజొన్న



రాజుపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్న కంది, మినుము, మిరప, మొక్కజొన్న, పసుపు తదితర పంటల్లో అంతర పంటలు సాగు చేయడం ద్వారా చీడపీడల నివారణతో పాటు రైతన్నలకు మంచి లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికా రులు సూచిస్తున్నారు. పత్తి పంటలో రెండుసాళ్లకు ఒకసాలు కంది సాగు చేయడం ద్వారా పచ్చపురుగుతో పాటు చీడపీడలు ఎక్కువగా సోకకుండా నివారించవచ్చు. పురుగులు ఎక్కువగా కందిపంటపైనే ఉండడంతో మందు పిచికారి చేయడం ద్వారా రెండు పంటలను రక్షించుకోవచ్చన్నారు. అలాగే మిరపలో బంతిపూల చెట్లు నాటడం ద్వారా తెగుళ్లను, బంతిపూలను పురుగు ఆశించడం ద్వారా మందు ప్రభావంతో నివారించడంతో పాటు దిగుబడి పెంచుకునేందుకు వీలుంటుందన్నారు. అదే విధంగా మొక్కజొన్నలో అంతరపంటగా మగ మొక్కజొన్నలు నాటడం ద్వారా కమర్షియల్ పంటకు క్వింటాకు రూ.2వేలు పలికితే సీడ్ మొక్కజొన్నకు క్వింటా రూ.6వేలు పలుకుతోంది. ఇది రైతులకు మంచి లాభదాయకమన్నారు. ఈ విధంగా పంటలు వేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు రెండు దిగుబడులు పొంది రైతన్నలు లాభాలు పొందవచ్చని వ్యవసాధికారులు సూచిస్తున్నారు.

చదువుతోపాటు క్రీడలపట్ల ఆసక్తి చూపాలి



గెలుపొందిన విద్యార్థులతో శ్రీచైతన్య యాజమాన్యం

సీకేదిన్నె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలప ట్ల ఆసక్తి చూపాలని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. స్థానిక శ్రీచైతన్య స్కూలు బృందావనం క్యాంపస్‌లో బీఎస్‌రావు మెమోరియ ల్ స్పోర్ట్స్‌డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే చదువులో బాగా రాణిస్తారన్నారు. విద్యార్థులు చదువును, క్రీడలను సమానం గా ఆదరించి జీవితంలో ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా త్రో బాల్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, అథ్లెటిక్స్‌లో విద్యార్థులకు కడప జోన్ లెవెల్ లో పోటీలు నిర్వహించారు. అంతేకాక సాంస్కృతిక విభాగంలో కూడా పోటీ లు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కా ర్యక్రమంలో ఆర్‌ఐ భాస్కర్, ప్రిన్సిపాల్ కిరణ్మయి, సాయికృష్ణ, ఇన్‌చార్జి చం ద్రబాబు, మారుతి, పీఈటీ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలసదనాల్లో ఉద్యోగావకాశాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళాభి వృద్ధి, శిశు సంక్షమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాల్లో వివిధ ఉద్యోగాలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధి కారత అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలపారు. పోస్టుల వివరాలు, అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తు ఫారాలను హెచ్‌టీపీపీఎస్/ కడప.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందాలని తెలిపారు. అర్హతలున్న అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధృవీకరణ పత్రాలు జతప రిచి ఈ నెల 27న సాయంత్రం 5గంటల్లోపు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికా రత అధికారి కార్యాయం డీబ్లాక్, కొత్త కలెక్టరేట్, కడపలో సమర్పిం చాలన్నా రు. అర్హత ప్రమాణాలను అనుసరించి కుదించబడిన జాబితాలోని అభ్యర్థుల ను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు తెలిపారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న బాలల పరిరక్షణ విభాగం, ప్రత్యేక దత్తత సంస్థ (శిశు గృహ)లో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు కాంట్రా క్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దర ఖాస్తులను ఈనెల 27న తమ కార్యాలయానికి అందించాలని పి.రమాదేవి వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్‌పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత పరిశు భ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. స్థానిక కలెక్టరే ట్‌లో బుధవారం నిర్వ హించిన జిల్లాస్థాయి పోషణ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. వాటర్, శానిటేషన్, హైజీన్‌పైన అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీవోలతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. చేతుల పరి శుభ్రతలో భాగంగా 7 స్టెప్స్ ద్వారా చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో తెలి పారు. భోజనానికి ముందు తరువాత, మల విసర్జన తరువాత చేతులు శుభ్ర పరచుకోవడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో 13 ప్రాజెక్టుల సీడీపీ వోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

మైలవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సంజాముల మండలం నొస్సం గ్రామానికి చెందిన ఓ మహిళ తన ముగ్గురి పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసు కునేందుకు యత్నిం చింది. కుటుంబ సమస్యల కార ణంగా తన ముగ్గురి పిల్లలను తీసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి బుధవారం మైలవరం జలాశయం వద్ద కు రాగా స్థానికులు గమనించి మైలవరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసు లు వారిని కాపాడారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా... జమ్మలమడుగులోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మహిళను నొస్సం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు కూతుర్లు, కుమారునితో జమ్మలమడుగుకు వ చ్చి.. అక్కడి నుంచి ఆటోలో మైలవరం జలాశయం వద్ద కు చేరుకుని జలాశయం గేట్ల వద్ద ఆత్మహత్య చేసుకోవ డానికి చూస్తుండగా గమనించిన ఓ ఆటో డ్రైవర్ మైల వరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మైలవరం పోలీసులు అక్కడకు చేరుకుని, ఆమెతో పాటు పిల్లలను మైలవరం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం , కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించినట్లు ఏఎస్‌ఐ లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబు ల్ రియాజ్‌లు తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం సుందరాచార్యుల వీధిలో నివాసం వుండే షేక్ అబీదా (42) అనే ఒంటరి మహిళ బుధవారం ఆత్మహ త్యకు పాల్పండింది. ఒన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి వివ రాల మేరకు షేక్ అబీదా గోపల్లెకు చెందిన వ్యక్తితో వివా వామైంది. మనస్పర్థలం కారణంగా విడిపోయి కుమా రుడితో కలిసి జీవిస్తుండేది. ఆమెకు ఒక్కగానొక్క కుమా రుడు ఖాసీం 18 నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అబీదా ఒంటరి జీవి తంతో మనస్థాపం చెంది నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి మెహరూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నిమ్మనపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హరీష్ (25) తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెంది నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లి పంచా యతీ పిట్టావాండ్లపల్లి వడ్డిపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు హరీష్ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపె నీలో పని చేస్తుండేవాడు. అయితే అతను మదన పల్లిలో సొంతంగా బ్యాటరీ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు తల్లిదండ్రులను అడిగాడు. దీనికి వారు వద్దని చెప్ప డంతో మన స్థాపం చెంది ఈనెల 5వ తేదీ ఇంట్లో వున్న విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించ గా, రుయా ఆస్పత్రిలో చికిత్స బుధ వారం మృతి చెందా డు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంటు...

గోపవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచాయిపేట పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వేముల వెంకటేశ్వర్లు (40) అనారోగ్యానికి గురై నెల్లూరులో చికిత్స పొందుతూ బుధ వారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మృతుడు వెంకటేశ్వర్లు నాలుగు రోజుల కిందట విధి నిర్వహణలో ఉండగా పక్షవాతం సోకింది. వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైపాస్‌రోడ్డు విస్తరణ పనులు



కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు శివారులోని ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద క ల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ బైపాస్ రోడ్డుతోపాటు పొట్టిపాడు రోడ్డు, కొర్రపాడు రోడ్డు, విస్తరణల కోసం ఆర్‌అండ్‌బీ శాఖకు సుమారు రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులను త్వర గా పూర్తి చేసి ప్రొద్దుటూరును సుందరీకరణగా తీర్చిదిద్దు తామన్నారు. కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆ ర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, మాజీ జడ్పీటీసీ స భ్యుడు తోట మహేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం



ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో సూచనలు చేస్తున్న డీఆర్‌ఎం

ఎర్రగుంట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేష్టేషన్‌ను బుధ వారం గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ సీఎస్ గుప్తా సందర్శించారు. స్టేషన్‌లో పరిశుభ్రతపై ఆరా తీశారు. అన్ని గదులను, రైల్వే ప్లాట్‌ఫారా లను, రైల్వే ఇంజిన్ డ్రైవర్స్ రెస్ట్ రూంను ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో జరుగుతున్న పలు పనులపై ఆయన ఆరా తీసి పలు సూచ నలు చేశారు. అనంతరం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చుట్టూ ఉన్న సిమెంట్ పరిశ్రమల యాజమాన్య హెచ్‌ఓడీలతో ఆయన ఎర్రగుంట్లలోని అల్ట్రాటె క్ సిమెంట్ పరిశ్రమలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా రైల్వే నుంచి రవాణా విషయంలో పరిశ్రమలకు గల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లోడింగ్ మరింత పెంచి రైల్వేల అభివృద్ధికి పూర్తి సహకారాలు అందించాలని కోరారు. అయితే సైడింగ్స్ లో ఉన్న సమస్యలపై పరిశ్రమల వారు డీఆర్‌ఎంకు వివరించారు. అలాగే స్పీడ్ పెంచాలని కోరారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ నుంచి అల్ట్రాటె క్ పరిశ్రమకు వెళుతున్న సైడింగ్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు.

యూజీడీ నిర్మించాలని వినతి

ఎర్రగుంట్ల నుంచి జువారి కర్మాగానికి వెళుతున్న రైల్వేట్రాక్ ఎర్ర గుడిపాడు రస్తా వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించాలని ఏఎంసీ చైర్మన్ నాగరాజు, కత్తి ప్రతాప్‌రెడ్డి తదితరులు డీఆర్‌ఎంకు వినతి పత్రం ఇచ్చారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సీనియర్ డివిజనల్ అధికారులు, స్థానిక అధికారులు డీఆర్‌ఎం వెంట ఉన్నారు.

రాయచోటిలో 50 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు

- శిబ్యాల పరిధిలోని భూమి అప్పగింతకు ఆదేశాలు
- ఎన్టీఆర్‌నగర్ పేరుతో ఇళ్ల సముదాయం

కలికిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరి ధిలో టిడ్కో ఇళ్ల నిర్మించడానికి ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. పట్టణ శివారులో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం 50 ఎకరా లను వెంటనే ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టరు పేరుతో బదలాయిం చాల్సిందిగా కలెక్టరును ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి శివారు శిబ్యాల గ్రామంలోని 50 ఎకరా లకు రూ.1.34 కోట్ల ధర నిర్ణయించింది. టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం జూలై 16న కలెక్టరు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించి ఏపీ టిడ్కోకు కేటాయించింది. శిబ్యాల గ్రామ సర్వే నం.2215లో 13 ఎకరాలు, 2216లో 19 ఎకరాలు, 2217లో 18 ఎకరాలు కలిపి మొత్తం 50 ఎకరాల ప్రభుత్వ భూమికి రూ.1.34 కోట్లు ఏపీ టిడ్కో ప్రభుత్వా నికి చెల్లించాల్సి ఉంది. అయితే ముందస్తుగా భూమిని అప్పగిస్తే అందులో రోడ్లు, ఇతరత్రా అభివృద్ధిని చేపట్టిన అనంతరం వచ్చే రాబడిని అనుసరించి చెల్లించేందుకు ఏపీ టిడ్కో ప్రతిపాదించింది. దీనిని ఆమోదిస్తూ 2025 నుంచి 2030 వరకు ఐదు వాయిదాల్లో చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ భూమిని అభివృద్ధి చేసిన అనంతరం అందులో ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బ న్-2.0 పథకం కింద 'ఎన్టీఆర్ నగర్' పేరుతో గృహ సముదాయా లను నిర్మించనున్నారు. ఈ భూమిలో ఉన్న కాలువలు, వంకలు, చెరువులు తదితర సహజ వనరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అవి యథాతథంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం షరతు విధించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే భూమిని స్వాధీనం చేసుకునేందుకు కలెక్టరుకు అధికారం కల్పిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

నిపుణుల జ్ఞానం విలువైనది : వీసీ



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిపుణులు అందించే జ్ఞానాన్ని ఆకలింపు చేసుకోవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నా రు. బుధవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో బీడీ బయో సైన్స్ ఇండియా సహకారంతో ఫ్లో సైటోమెట్రీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై ఒకరోజు సదస్సు జరిగింది. వీసీ ఆచార్య రాజశేఖర్ సదస్సును ప్రారం భించి నిపుణులను అభినందించారు. బీడీ బయోసైన్స్ సంస్థ సీనియర్ అప్లికేషన్ స్పెషలిస్ట్ కె.కరుణకు మార్ ఫ్లో సైటోమెట్రీ సాంకేతికత, దాని అనువర్తనాలపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు ఇమ్యునాలజీ, క్యాన్స ర్ బయాలజీ, సూక్ష్మజీ వుల గుర్తింపు వంటి రంగాల్లో ఫ్లోసైటోమెట్రీ వినియో గంపై అవగా హన కల్పించారు. జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.దక్షాయణి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎల్.సుబ్ర మణ్యశర్మ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ : పీజీ విద్యార్థుల వసతి గృహాలను వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల రుచి, నిర్వహ ణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి మందు లు, ఇతర అవసరాలను ఆరాతీశారు. వీసీ వెంట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ ఉన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తి చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీ చంద్రానాయక్

వేముల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంట నమోదు, ల్యాండ్ పార్సిల్స్ ఈనెల 20వ తేదీ లోపు పూర్తి చేయా లని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ రైతు సేవా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలం లోని చాగలేరు, పెద్దజూటూరు రైతు సేవా కేంద్రాలను ఆయన అకస్మిక తనిఖీ చేశారు. రైతు సేవా సిబ్బంది, రైతులతో రబీ సీజన్, ప్రస్తుత పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో శనగ విత్తనాలు పంపిణీ ఉంటుందన్నారు. ఏఓ ఓబులేసు, మాజీ సర్పంచు బొగ్గుల భాస్క ర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో ప్రైవేటు ఆసుపత్రి సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు

పీలేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని మాపక శాఖ అనుమతి లేకుండానే నిర్వహి స్తున్నారంటూ పీలేరులోని అశ్విని హాస్పిట ల్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారులు సీజ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య, డెమో అధికా రిణి దేవశిరోమణి మాట్లాడుతూ పీలేరులోని అశ్విని హాస్పిటల్ వారు ప్రభుత్వ అనుమ తుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో దర ఖాస్తు చేసుకున్నారని, మార్చిలో వారి దర ఖాస్తు తిరస్కరణకు గురైందన్నారు. అనుమ తులు లేకుండా ఆసుపత్రి నిర్వహించరాదని తెలిసినా వారు పట్టించుకోలేదని, స్పందన కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదు మేరకు తాము పరిశీ లించి ఆసుపత్రిని సీజ్ చేశామన్నారు. ఆసుపత్రి నిర్వాహ కులు పూర్తి అనుమ తులు తీసుకున్న తరువాత ఆసుపత్రిని మరలా నిర్వహించు కోవచ్చునని స్పష్టం చేశారు. అయితే తమ దరఖాస్తు తిరస్కర ణకు గురైన తరు వాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సంబంధిత అధికా రులు సెలవులో ఉండడంతో తాము ముందుకు వెళ్లలేకపోయామని, మాకు సమయం ఇస్తే అన్ని అనుమతులు తీసుకుంటామని ఆసుపత్రి నిర్వాహ కులు డాక్టర్ శ్రమంత్ కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. కాగా కేవలం అగ్నిమాపక శాఖ అనుమతులు లేని కారణంగా అశ్విని ఆసుపత్రిని సీజ్ చేయడం తగదంటూ వైసీపీ విద్యార్థి విభాగం, ఎన్ఎస్‌యూఐ నాయ కులు వైద్య ఆరోగ్య శాఖాధికారులు ముందు ఆందోళన చేపట్టారు. వైద్య సదుపాయాల పరంగా ఎటువంటి ఫిర్యాదులు లేకపో యినా, ఆసుపత్రి నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సీజ్ చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇటీవల బాలిక కాన్పు వ్యవహారం జరిగిన మాధవి ఆసుపత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలే దని, తొలుత ఆ ఆసుపత్రిపై చర్యలు తీసుకో వాలని వారు డిమాండ్ చేశారు.

మాధవి ఆసుపత్రిలో రికార్డుల పరిశీలన

మల్లెల గ్రౌండ్స్‌లోని మాధవి ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధ వారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వాహకురాలైన డాక్టర్ మాధవి ప్రస్తుతం అందుబాటులో లేరని, అయితే ఆసుపత్రిలో రికా ర్డులన్నీ సక్రమంగా ఉన్నాయని పరిశీలన అనం తరం అధికారులు వివరించారు.

రేపు మండల సమావేశం

కొండాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 16వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని అన్ని ప్రధాన సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో ఆ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

జమ్మలమడుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు ఎన్జీవో హోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనకు వస్తున్నారన్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ తదితర సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండు చేశారు. చేనేతలు పనులు లేక ముడిసరుకుల ధరలు పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీషాపు యజమానికి జరిమానా

బద్వేలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ విజిట్‌లో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పలు ఏరియాలలో సిబ్బందితో కలిసి సందర్శించారు. ఇందులో భాగంగా ఆయన రోడ్లపై చెత్త వేయకుండా పలువురికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే నెల్లూరు రోడ్డులోని ఓ టీషాపు యజమానికి రోడ్డుపై చెత్త వేయడంతో రూ.2వేలు జరిమానా విధించారు. మున్సిపాలిటీ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.





ఆరోగ్యమే మహాభాగ్యం

● గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని మండల విద్యాశాఖాధికారి పుల్లయ్య అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మండల కేంద్రంలోని బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ తినే ముందు కచ్చితంగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. చేతులు పరిశుభ్రత లేకపోవడం వల్ల అతిసార, శ్వాసకోశ వ్యాధులతో పిల్లలు అధిక సంఖ్యలో మరణిస్తున్న నేపథ్యంలో 2008లో ఐక్యరాజ్యసమితి అక్టోబరు 15న వరల్డ్ హ్యాండ్‌వాష్‌డేగా ప్రకటించిందన్నారు. అలాగే మండలమహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 11పంచాయతీల్లోని పలు గ్రామాల్లో చేతుల పరిశుభ్రతపై గ్రామ సంఘం అసిస్టెంట్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌స్వామిరెడ్డి, ఎంఆర్‌కే మూర్తి, తుపాకుల శ్రీనివాసులు, గురవయ్య, అన్నపూర్ణ, శివప్రసాద్‌రెడ్డి, విజయలక్ష్మి, ఓబులేసు, పీఈటీ పుష్పలత, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సీతారామిరెడ్డి, బాలయ్య, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల చేతులకు నీళ్లు పోస్తున్న ఎంఈవో పుల్లయ్య

హార్టికల్చరల్ అధికారుల కుంటిసాకులు

● మండల సమావేశంలో మండిపడ్డ ఎంపీపీ

ఖాజీపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశానికి ఎప్పుడు వచ్చినా హార్టికల్చరల్ అధికారులు కుంటిసాకులు చెప్పడం తప్ప రైతులకు ప్రభుత్వ పథకాల గురించి చెప్పడంలో విఫలమయ్యారని ఎంపీపీ సిద్ధిక్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మైదుకూరు మార్కెట్‌యార్డు చైర్మన్ రవీంద్ర, రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల పరిధిలోని మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ జరగడం లేదని, ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 707 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద తొమ్మిది మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, యూరియా లేదన్న అపోహలు నమ్మవద్దన్నారు. పల్లెపండుగ 2.4లో రెండు నెలల్లో సీసీ రోడ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో అగ్రహారం సొసైటీ చైర్మన్ హరినాథరెడ్డి, తహసీల్దారు రమణమ్మ, ఏవో వెంకటరమణ, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి : సీఐ

ప్రొద్దుటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో టపాసుల విక్రయాలు జరిపే వ్యాపారులు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని టూటౌన్ సిఐ సదాశివయ్య తెలిపారు. బుధవారం స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులోని టపాసుల విక్రయాల దుకాణాల ప్రాంతాన్ని సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా టపాసుల షెడ్ల మధ్య దూరం, ప్రమాదం జరిగితే అవసరమైన రక్షణ ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. పలు రకాల సేఫ్టీ ప్రికాషన్స్ కూడా వ్యాపారులకు సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

మైలవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సబ్ డివిజన్ అధికారి లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కర్మలవారిపల్లె గ్రామం వద్ద ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూరగాయలు, ఆకుకూరల సీడ్ కిట్లు, ప్యాకెట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ అధికారి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులంపేరుతో దూషణ

చాపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన మిలటరీ సుబ్బారెడ్డి తనను కులం పేరుతో దూషించి గాయపరిచినట్లు చాపాడు గ్రామం దళితవాడకు చెందిన చాట్ల శ్రీనివాసులు ఆరోపించారు. ఈనెల 14న మంగళవారం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో బ్రాందీ షాపు వద్ద ఉండగా సుబ్బారెడ్డి తనను చేతులతో బలంగా తోయడంతో కిందపడినట్లు బాధితుడు తెలిపాడు. బండరాళ్లపై పడటంతో తలకు పెద్ద గాయమైందన్నారు. శ్రీనివాసులును చికిత్సకోసం కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఏఎస్ఐ నాగేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా శ్రీనివాసులు ఫిర్యాదు చేసిన విషయం నిజమేనని, ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు. కాగా శ్రీనివాసులును కులం పేరుతో దూషించిన మిలటరీ సుబ్బారెడి పై పోలీసులు కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శివశంకర్, రమేష్ డిమాండు చేశారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

బద్వేలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆక్రమిత భూములలో బుధవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గత కొద్ది రోజుల నుంచి రెవెన్యూ అధికారులు పలు ఆక్రమిత భూములను స్వాధీన పరుచుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో వీరబల్లి గ్రామ సర్వేనెంబరు 528-2లో ఉన్న మూడు ఎకరాల భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు జాగ్రత్తగా ఉండాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

చాపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామం వద్ద ఉన్న పెన్నానది నది నుంచి కొంతమంది వ్యక్తులు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారని గ్రామస్థులు తహసీల్దారు రమాకుమారికి బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఈ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఇసుకను తరలిస్తే తమ గ్రామానికి తాగు, సాగునీరు దొరకదని వాపోయారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని వీఆర్వో పెద్దన్నకు, ఎస్ఐ చిన్నపెద్దయ్యకు ఆదేశాలు జారీ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఓబులేసు, సుబ్బరాయుడు, చంటి, శేఖర్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయిదు ట్రాక్టర్లు స్వాధీనం

తిప్పిరెడ్డిపల్లె గ్రామం వద్ద పెన్నానదిలో ఇసుక కోసం ఉన్న అయిదు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఏఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఒకదానిలో మాత్రమే ఇసుక ఉండగా మిగిలిన నాలుగు ట్రాక్టర్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

బాటిళ్లు, హ్యాండ్‌వాష్ అందజేత

పోరుమామిళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా పోరుమామిళ్లలోని మదర్‌థెరిసా ఫౌండేషన్, బ్లెస్సెడ్ భయాన్ ఫౌండేషన్ సంయుక్తంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాలలకు బాటిళ్లు, హ్యాండ్‌వాష్ అందించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల సెంటరులో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి బాటసారులకు బాటళ్లు అందించారు. అలాగే పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ పంచాయతీ ఆవరణంలో ఉన్న అంగన్వాడీకేంద్రంలో చేతులు శుభ్రపరచుకునే విధానంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, గిరి ప్రణీత్‌రెడ్డి, డాక్టర్ అమితారెడ్డి, ప్రజ్వలరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

మూడంచెల స్థాయిలో పరిశీలకుల నియామకం

● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సూచనల మేరకు మూడంచెల స్థాయిలో పరిశీలకుల నియామకం చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. నియోజకవర్గపరిధిలో గ్రామ, పట్టణ, అనుబంధ విభాగాల కమిటీలను నియమించే కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక వైసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కమిటీలు, అనుబంధ విభాగాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, పి.గిరిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎస్.ఉప్పలపాడు గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా అందించాలి

బద్వేలు, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి అన్ని విధాలా సహకరించాలన్నారు. మోదీ ఇచ్చిన ఏ హామీని ఇంతవరకు నెరవేర్చలేదని, ఈ సందర్భంగా పీఎం కర్నూలు పర్యటనను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలుతో పాటు కార్మికుల హక్కులను కాలరాసే విధానాలు సరిదిద్దాలని డిమాండు చేశారు. పీఎం పర్యటనను వ్యతిరేకిస్తూ మోదీ గో బ్యాక్ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం అరికట్టేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష'

ముద్దనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్తీ మద్యం అరికట్టేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సర్కిల్ పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, తొండూరు, సింహాద్రిపురం మండలాల మద్యం షాపుల నిర్వాహకులతో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయించినా వినియోగదారులు ఈ యాప్ ద్వారా గుర్తించవచ్చన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణాల్లో ప్రతి మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి అమ్మకాలు జరపాలన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల బెడదను అరికట్టాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీలో దోమలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఎంపీడీవో కార్యాలయం ఏవో బాలన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు మేరీకుమార్, కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దోమల బెడద అధికమైందన్నారు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో చెత్త పేరుకుపోయి మురికినీరు నిల్వ ఉంటోందని, దీంతో దోమలు ప్రబలుతున్నాయన్నారు.

దోమల వల్ల డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడే అవకాశం ఉందని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాలువల్లో పూడికతీసి దోమల నివారణకు మందులు పిచికారి చేయాలని కోరారు.

గీతాశ్రమంలో విద్యాసంస్థల తనిఖీ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న విద్యాసంస్థలలో దేవాదాయ శాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. గీతాశ్రమంలో ఉన్న వివిధ ప్రైవేటు విద్యాసంస్థలలో కొన్ని దేవదాయ శాఖకు తక్కువ మొత్తంలో బాడుగ చెల్లిస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, గీతాశ్రమ ఈవో వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం దేవాదాయ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నిఖిల్ బృందం ఆశ్రమంలోని మొత్తం విద్యాసంస్థలు ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేశారన్న అంశంపై కొలతలు తీసుకున్నారు.

ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి



మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని బుధవారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణి ప్రయోగరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండి నిరాడంబర జీవితం గడిపారన్నారు. రాష్ట్రపతిగా ఉన్నా విద్యార్థులతో గడపడానికే ఇష్టపడేవారని, ఆయన జన్మదినాన్ని ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా జరుపుకోవాలని 2015లో ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక అంబాభవాని దేవాలయం సమీపాన విద్యార్థులు, స్థానిక ముస్లింలు కలాం జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి, ఉపాధ్యాయుడు దస్తగిరి, టీడీపీ నాయకులు గౌస్ అహమ్మద్, షబ్బీర్, అచ్చుకట్ల అన్వర్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

మఠం పీఠాధిపతిగా గోవిందస్వామిని నియమించండి

● ఏపీ సాధు పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి, ప్రకాశానంద సరస్వతి

కడప మారుతీనగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠానికి గోవిందస్వామిని పీఠాధిపతిగా నియమించాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ, ప్రకాశానంద సరస్వతి స్వామీజీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మఠానికి నాలుగు సంవత్సరాలుగా పీఠాధిపతి లేకపోవడం హిందూ భక్తులకు వెలితిగా ఉందన్నారు. గోవిందస్వామి ఎంపికకు అతని అన్నదమ్ములు సైతం సహకరించేందుకు ముందుకు రావాలన్నారు. మఠం విషయంలో వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేయకుండా మఠానికి మరింత ఖ్యాతి దక్కేలా చేయాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

జమ్మలమడుగు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, జీవోనెం.590ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఏవో ఇక్బాల్‌బాషకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలను కూటమి ఎన్డీయే ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేసి రాష్ట్రంలోని బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. బడుగు, బలహీన, పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్య దూరం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఖాజీపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీపీఎంవో నాగశశిభూషణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగసానిపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి రక్త నమూనాలు సేకరించి నివేదిక అందించి వారికి తగిన మందులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్, విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రేషన్ ఇవ్వడం లేదని ఫిర్యాదు

పోరుమామిళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తమకు రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని కాల్వకట్ట, కొరపాటిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు 33వ షాపు డీలరు రేషన్ సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సర్వరు పని చేయడలం లేదని కొద్దిరోజులు, సమయానికి రావడం లేదని మరికొన్ని రోజులు సాకులు చెబుతున్నారన్నారు. తమకు అందాల్సిన రేషను సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆర్ఐని వివరణ కోరగా పోర్టబులిటీ ఉన్న కారణంగా ఆ డీలరుకు కేటాయించిన రేషన్ అయిపోయిందని, అయినా వీరికి రేషను అందేలా చేస్తామన్నారు.

ఓటు చోరీని అరికట్టాలి

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఓటు చోరీని అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష తెలిపారు. ఈ సందర్భం గా బుధవారం ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేశామన్నారు. ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఓటు చోరీలు దేశానికి ప్రమాదకరమన్నారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలపై సంతకాలు సేకరించి జిల్లా కాంగ్రెస్ కమిటీ ద్వారా ఏపీసీసీకి పంపడం జరిగిందన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

బద్వేలు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య అన్నారు. మండల పరిధిలోని అనంతరాజపురంలోని విలేజీ హెల్త్ క్లినిక్‌లో, ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్లోబల్ హ్యాండ్‌వాష్ డేపై అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తి స్పృహ కోల్పోతే ఏ విధంగా రక్షించాలన్న విషయాన్ని సీహెచ్‌వో శిరీషా ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి

కాశినాయన, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంటువారిపల్లెలో ఉన్న సర్వే నెంబర్ 72-1లోని 8 సెంట్ల ఇంటి స్థలాన్ని రూ.80 వేలకు గొంటువారిపల్లె చెందిన కందుల నడిపి చెన్నారెడికి అమ్మి అగ్రిమెంట్ రాసిచ్చామని, ప్రస్తుతం తన కుమారుడు కందుల చెన్నారెడ్డి అడ్డుపడుతున్నాడని అదే గ్రామానికి చెందిన కందుల కుంటి చెన్నారెడ్డి భార్య తిరుపాలమ్మ బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు తల్లిదండ్రుల ఆలనాపాలనా చూసుకోకపోవడంతో అవసరాల కోసం ఈ స్థలాన్ని అమ్ముకున్నామని సర్పంచ్ పిచ్చిరెడ్డితో కలిసి తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు విన్నవించారు. గ్రామంలో విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు ఆత్మీయ ఆహ్వానం

మైదుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 2025 మెగా డీఎస్సీలో కొలువుపొంది మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విధుల్లోకి చేరిన నూతన ఉపాధ్యాయులు బి.స్వర్ణలక్ష్మి, ఎస్.రవీంద్రరెడ్డిలకు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎండీ ఇలియాస్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్వీస్ఫైల్, సర్వీస్ రిజిష్టర్‌లు అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఆనందరావు, సురేంద్రనాయక్ పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

జమ్మలమడుగు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పట్టణంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం అధికారులు తుప్పుపట్టి దెబ్బతిన్న స్తంభాల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈడిగపేటలో, కన్నెలూరు, తదితర ప్రాంతాల్లో ఈ స్తంభాలను మార్చినట్లు సిబ్బంది తెలిపారు.

